క్లుప్తంగా

మూలకు చేరిన ఆర్‌ఓ ప్లాంట్



పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్

వీరఘట్టం: మండలంలోని సంత – నర్శిపురం మోడల్ ప్రైమరీ పాఠశాలలో కొన్ని రోజులుగా ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి తాగునీరు కొనుగోలు చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ఈ మేరకు రక్షిత మంచినీటి వల్ల కలిగే ఉపయోగాలు, చేతులు పరిశుభ్రతపై బుధవారం అవగాహన కల్పించారు.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించాలి

వీరఘట్టం: గ్రామాల్లోని అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించాలని ఎంపీడీఓ బి. వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. లే అవుట్లకు తప్పనిసరిగా పంచాయతీ అనుమతులు ఉండాలన్నారున. అన్ని అనుమతులుంటే వాటిని వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సీహెచ్ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

వీరఘట్టం: ప్రభుత్వ అనుమతుల్లేకుండా బాణాసంచా సామగ్రి విక్రయించరాదని ఎస్సై జి.కళాధర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గుట్టుగా మందుగుండు సామగ్రి తయారు చేసినా.. విక్రయించినా శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. మండలంలో ఎవరికీ మందుగుండు సామగ్రి అమ్మేందుకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

సుడిదోమ తెగులుపై తస్మాత్..



పెదమేరంగిలో వరి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కురుపాం: వరి సుడిదోమ తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం సస్యపోషణ శాస్త్రవేత్త డా. స్రవంతి, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డా.ఎం.అనంత విహారిలు సూచించారు. బుధవారం పెదమేరంగిలో రైతులు ఇచ్చిన సమాచారం మేరకు వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో సుడిదోమ తెగులు ఆశించినట్టు గుర్తించి సుడిదోమ తెగులు ఆశించినప్పుడు వరిలో పురుగులు దుబ్బులో అడుగు నీటి మట్టంపై ఉండి దుబ్బులో రసాన్ని పీల్చుతాయని తెలిపారు. ఈ పంటల పరిశీలనలో రైతులతో పాటు రావెప్ విద్యార్థులు పాల్గొన్నారు .

యాజమాన్య పద్ధతులపై అవగాహన అవసరం

కురుపాం: గిరిజన రైతులు యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు సూచించారు. బుధవారం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో జీడి పరిశోధనా స్థానం పుత్తూరు వారి సౌజన్యంతో 30 మంది రైతులకు జీడి పంటలో దిగుబడులు పెంపొందించేందుకు యాజమాన్య పద్ధతులు, జీడిమామిడి పునరుద్ధరణ, టాప్ వర్కింగ్, అంతర్ పంటలైన పైనాపిల్, పసుపు సాగు తదితర పంటల కోసం అవగాహనను కల్పించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన గిరిజన రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన



బిచ్చుమానుగూడలో పంటను పరిశీలిస్తున్న వెలుగు ప్రతినిధులు

భామిని: మండలంలోని బిచ్చుమానుగూడలో వెలుగు అధికారులు బుధవారం పర్యటించి ప్రకృతి సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెలుగు రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పచ్చదనం పెంచడమే ప్రకృతి సాగు ధ్యేయమన్నారు. ప్రకృతి సాగు విధానం వల్ల తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సంబరాలు

వీరఘట్టం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి జరగనున్న చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్.మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొండపల్లి గౌరునాయుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సంబరాల్లో భాగంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 18న పాఠశాల స్థాయిలో.. నవంబర్ 1న మండల స్థాయిలో.. నవంబర్ 23న జిల్లా స్థాయిలో.. డిసెంబర్ 12,13,14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో చెకుముకి పరీక్షలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనాలని కోరారు.

కబ్జా కోరల్లో పాఠశాల ప్రాంగణం

- ఆటలకు దూరమవుతున్న తెట్టంగి హైస్కూల్ విద్యార్థులు
- దృష్టి సారించని యంత్రాంగం



తెట్టంగి జిల్లా పరిషత్ హైస్కూల్

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు విశాలమైన స్థలం ఉంది. అయితే విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు మాత్రం కుదరడం లేదు. హైస్కూల్ ప్రాంగణం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ స్థలంలో ఆటలు ఆడుకునే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ జరుగుతున్న విషయమంతా అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. దశాబ్దాల కాలంగా తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి నోచుకోవడం లేదు. పాఠశాల ఆవరణ ఆక్రమణకు గురవ్వడంతో పాటు గ్రామంలో చోటుచేసుకున్న కొన్ని పరిణామాలతో పాఠశాలలో విద్యా ప్రమాణాలు రోజురోజుకూ కుంటుపడుతున్నాయి. ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆక్రమణల విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినా.. వారు చేపడుతున్న మొక్కుబడి చర్యలతో సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది ఈ పాఠశాల పరిస్థితి...

ఇదీ పరిస్థితి..

జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో సగానికి పైగా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. సుమారు 11 పూరి ఇళ్లను కొందరు వ్యక్తులు గతంలో నిర్మించుకున్నారు. ఇది ప్రభుత్వ స్థలం ఖాళీ చేయాలని చెబుతున్నా.. వారు ఖాళీ చేయకపోవడంతో ఈ ఆక్రమణలు పాఠశాల అభివృద్ధికి విఘాతంగా మారాయి. సుమారు ఎకరా స్థలం ఉన్నప్పటికీ ఆక్రమణల వల్ల విద్యార్థులు ఆడుకోవడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. అలాగే పాఠశాల ఆవరణలో ఇతర వ్యక్తులు వచ్చి నిత్యం తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో పాఠశాల పరిస్థితి దయనీయంగా మారింది.



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పూరిళ్లు

ఇళ్ల పట్టాలు ఇచ్చినా కదలని వైనం..

పాఠశాల ఆవరణలో పూరిళ్లు వేసుకున్న వారికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేరే ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చింది.అయితే కొంతమంది ఇళ్ల పట్టాలు తీసుకున్నా ఇక్కడ నుంచి మాత్రం వెళ్లలేదు. గతంలో రెవెన్యూ అధికారులు ఈ సమస్య పరిష్కరించేందుకు వారితో మాట్లాడారు. ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు కూడా ప్రభుత్వమే కట్టించి ఇస్తుందని హామీ ఇచ్చినా సర్వే వీరు మాత్రం ఖాళీ చేయకపోవడం విశేషం.

ఉన్నతాధికారుల దృష్టికి..



తెట్టంగి హైస్కూల్‌లో నెలకొన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. గతంలో వీరికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశాం. అయితే వీరు ఇక్కడ స్థలాన్ని ఖాళీ చేసేందుకు ససేమిరా అంటున్నారు. వీరిని త్వరలోనే ఖాళీ చేయించి పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

– ఏఎస్ కామేశ్వరరావు, తహసీల్దార్, వీరఘట్టం

పాఠశాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి..

దశాబ్దాల కాలంగా ఈ సమస్య వేధిస్తున్నందున గ్రామపెద్దలు రాజకీయాలకతీతంగా ఏకతాటి పైకి రావాల్సి ఉంది. పాఠశాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలి. ఈ పాఠశాలలో ఎక్కువగా చదివేది ఇక్కడి విద్యార్థులే. అందుకే గ్రామస్తులందరూ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ముందుకు రావాలి. అలాగే ఉన్నతాధికారులు కూడా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

కోటి సంతకాలతో ప్రభుత్వానికి కనువిప్పు

- ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు



కోటి సంతకాల సేకరణలో భాగంగా చేపడుతున్న ర్యాలీ

వీరఘట్టం: కోటి సంతకాల సేకరణతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. బుధవారం స్థానిక బార్నాలవీధిలో చేపట్టిన కోటి సంతకాల సేకరణకు అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తూ పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఓ మంచి సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, వాటిని నిర్వీర్యం చేయాలని ప్రస్తుత ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రజలకు విద్య, వైద్య సేవలు పక్కాగా అందేలా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి గోవిందరావు, డి.లలితకుమారి, పిన్నింటి శ్రీను, భోగి మణి, దౌలూరు శ్రీకాంత్, అంబళ్ల రవి, నల్లబిల్లి విస్సు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నందీశ్వరుడి తిరువీధి



నందీశ్వరుడి తిరువీధి

పాలకొండ రూరల్: పట్టణంలోని దేవరపేట, మేదరవీధిలో కొలువుదీరిన నందీశ్వరుని ఉత్సవాలు వైభవోపేతంగా బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ నేపథ్యంలో స్వామివారి తిరువీధి ఘనంగా నిర్వహించారు. అనంతరం నాగావళి నదీతీరంలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మొబైల్ యాప్‌తో మద్యం తనిఖీ

కురుపాం: మద్యంలో నాణ్యత తనిఖీ కోసం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మొబైల్ యాప్‌ను అందుబాటులోకి వచ్చిందని దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏపీ ఎక్సైజ్ సురక్ష అనే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్‌లోడు చేసుకొని కన్స్యూమర్ అనే టాబ్‌పై క్లిక్ చేస్తే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడానికి వీలు అవుతుందన్నారు. ఈ మొబైల్ యాప్ లిక్కర్ సీసాకి మాత్రమే వర్తిస్తుందన్నారు. లిక్కర్ నాణ్యతకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే 6302936599 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గుమ్మలక్ష్మీపురం: ఆరోగ్యమంతా చేతుల పరిశుభ్రతతోనే ఉంటుందని ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి కనకదుర్గ అన్నారు. బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కుంబురుక దీనమయ్య పీడీ కనకదుర్గ మాట్లాడుతూ చేతుల ద్వారానే వ్యాధి కారక సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశిస్తాయని అన్నారు. చేతుల శుభ్రత ప్రతీ ఒక్కరికీ అవసరమేనని, భోజనం చేసే ముందు కచ్చితంగా చేతులు కడుక్కోవాలంటూ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ఎం.రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.గౌరీశంకరరావు, భద్రగిరి సీడీపీవో కె.విజయగౌరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ: విధి నిర్వహణలో ఉండే 108 సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 108 ప్రోగ్రాం మేనేజర్ మహమ్మద్ గౌస్ బాషా సూచించారు. బుధవారం ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న 108 నవజాత శిశు అంబులెన్స్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోగులతో మర్యాదపూర్వంగా మెలగాలన్నారు. ఆయనతో పాటు ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ చిరంజీవి, 108 జిల్లా మేనేజర్ మన్మధనాయుడు, డివిజనల్ అధికారి గిరిబాబు, 108 సిబ్బంది గణపతి, రమణ, శ్రీనివాస్, అనంతరావు, మురళీ, తదితరులు ఉన్నారు.

నేడు రైతు సంఘ మహాసభలు



మాట్లాడుతున్న సంఘ నాయకులు

పాలకొండరూరల్: పట్టణంలోని గాయత్రీ కల్యాణ మంటపంలో గురువారం ఏపీ రైతు సంఘ 9వ మహాసభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘ సభ్యులు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానం నుంచి ర్యాలీ చేపడతామన్నారు. ఈ మహాసభలో రైతుల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, పోరాట ప్రణాళికలపై చర్చిస్తామన్నారు.

అదనపు బాధ్యతలు

సీతంపేట: ఐటీడీఏ ఏపీఓ (అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్)గా వెంకటగణేష్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం పీహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఏపీఓగా పనిచేసిన చిన్నబాబు సెలవుపై వెళ్లడంతో.. ఆ బాధ్యతలను పీహెచ్‌ఓ వెంకటగణేష్‌కు అప్పగిస్తూ పాలకొండ సబ్ కలెక్టర్, ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తీర్మానించిన అంశాలు పరిష్కారం కావాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ దీనమయ్య



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: మండల సర్వసభ్య సమావేశంలో ప్రజావసరాల నిమిత్తం ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను(తీర్మానించిన) అధికారులు బాధ్యత తీసుకొని పరిష్కరించాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలను తెలియజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులకు ప్రశ్నించారు. రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేయాలని, పశువైద్య సేవలు సక్రమంగా అందివ్వాలని, శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టడం లేదా నూతన భవనాలు నిర్మించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందివ్వాలంటూ ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ ఎం.కనకదుర్గ మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలో 37 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తించామన్నారు. గ్రామాల్లో గ్రామ కంఠం లేదా దాతల సాయం ద్వారా స్థలాన్ని అప్పగిస్తే అంగన్‌వాడీ నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, నిమ్మక లక్ష్మణరావు, ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు, కురుపాం ఏఎంసీ చైర్మన్ కె.కళావతి పాల్గొన్నారు.

చెప్పడం కాదు.. ఆచరించి చూపాలి

- రైతు సాధికార సంస్థ ఈడీ డాక్టర్ బాబూరావు



ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల స్వీయ అనుభవాలను తెలుసుకుంటున్న రైతు సాధికార సంస్థ ఈడీ బాబూరావు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులుకు చెప్పడంతో పాటు ఆచరణలో చేసి చూపిస్తే రైతులు ఆ పద్ధతులను అవలంబిస్తారని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. టి.బాబూరావు ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని తోటపల్లిలోని జట్టు ట్రస్టులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రకృతి వ్యవసాయ విధానంలో అవలంభిస్తున్న పద్ధతులపై రైతులు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో ఆయన చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త తమకు కేటాయించిన ప్రాంతంలో రైతుల సంఖ్య, వ్యవసాయ భూమి వివరాలు, అక్కడ పండే పంటలు, అక్కడ వచ్చే దిగుబడి, వారి ఆదాయ మార్గాలు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగివుండాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రప్రథమంగా శతశాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మార్చిన కొండబారిడి గ్రామ కార్యకర్త పత్తిక నరేష్‌ను అభినందించి నగదు ప్రోత్సహకాన్ని అందించారు. కార్యక్రమంలో జట్టు వ్యవస్థాపకులు డా.డి.పారినాయుడు, డీపీఎం శ్రావణ్‌కుమార్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, మక్కువ, పాచిపెంట, సాలూరు మండలాల ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో పాటు జట్టు ట్రస్టు ఈడీ ప్రహరాజ్, సిలబస్ కన్సల్టెంట్ టి.శివాజీ, ఎస్ఆర్‌పీలు దేవుళ్ళు, ఉత్తరాంధ్ర రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్, రచయితలు ఆర్.వాసుదేవరావు పాల్గొన్నారు.

ఆరిక తేగ.. ఏమి రుచి..!



ఆరిక తేగను చూపుతున్న గిరిజన మహిళలు బిడ్డిక రాధమ్మ, రూపమ్మ

కురుపాం: ఆహా..ఆరిక తేగ ఏమి రుచి, ఆరోగ్యం అంటున్నారు మన్యం జిల్లాలోని గిరిజనులు.. గిరి శిఖరాల్లో లభించే ఈ ఆరిక తేగ సహజ సిద్ధంగానే పండుతుంది. వర్షాలు పడినప్పుడు గిరిజనులు వీటిని అన్వేషించి తవ్వి సేకరిస్తారు. వీటిని అన్నంతో పాటు కూరగాను, లేదా ఉడకబెట్టుకొని తినడం పురాతనంగా గిరిజనులకు అలవాటు. వీటిని ఎంతో ప్రీతిపాత్రంగా ఆరగిస్తారు. ఈ ఆరిక తేగలో మంచి పోషకాలు ఉంటాయని గిరిజనులు చెబుతున్నారు. ఈ మధ్యకాలంలో వర్షాలు తరుచుగా పడటంతో గిరిజనులు ఆరిక తేగలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న నిడగల్లు గూడకు చెందిన బిడ్డిక రాధమ్మ, రూపమ్మలు సుమారు 6 కిలోమీటర్ల నడిచి గిరి శిఖరంపై ఆరిక తేగను తవ్వి సేకరించినట్టు తెలిపారు. వీటిని తాము ఎంతో ఇష్టంగా ఆరగిస్తామని తెలిపారు.

స్పందించారు.. చెత్తను తొలగించారు...



శివ్వన్నపేట జెడ్పీ హెచ్ఎస్ ఆవరణలో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కురుపాం: మండల కేంద్రం శివ్వన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద దుర్గంధం వెదజల్లుతుండటంతో విద్యార్థులు పడుతున్న అవస్థలను సాక్షి దిన పత్రికలో ముక్కు మూసుకోవాల్సిందే.. శీర్షికతో ఇటీవల ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. పంచాయతీ అధికారులు, ఉప సర్పంచ్ షేక ఆదిల్ పారిశుధ్య కార్మికులతో పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను బుధవారం తొలగింపజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో, సీడీపీవోలు

కురుపాం: మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రజనిదుర్గా మాట్లాడుతూ విద్యార్థులకు బాలబాలికల హక్కులు, పోషకాహారం, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమారి, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శంకరరావు, డీసీపీవో లీగల్ అధికారి శ్రీధర్, హరికృష్ణ, సూపర్‌వైజర్లు రమ, జానకి, ఐసీడీఎస్ సిబ్బంది భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దండి



సూచనలిస్తున్న పీహెచ్‌ఓ గణేష్

సీతంపేట: గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఐటీడీఏ పీహెచ్‌ఓ ఎస్వీ గణేష్ అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ పరిధిలో ఎన్‌జీఓలు, ఎస్‌హెచ్‌జీ సంఘాలు, రైతు ఉత్పత్తిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఓ మాట్లాడుతూ.. రైతులకు అవవసరమైన పరికరాల పంపిణీకి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అనంతరం పుట్టగొడుగుల పెంపకం, పసుపు ఉడకబెట్టే యంత్రాలు, సోలార్ డ్రైవర్స్, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలపై చర్చించారు. కార్యక్రమంలో వెలుగు ఆర్డీ ఎన్‌జీఓ సిబ్బంది సంజీవరావు, ఎల్.సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ పరిశీలన



పుస్తకాల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వసంతకుమారి, ఎంఈఓ భాస్కరరావు

భామిని: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ స్కూల్‌లో పుస్తకాల పంపిణీ ప్రక్రియను ఎంపీడీఓ వసంత కుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పుస్తకాలు ఏయే పాఠశాలలకు ఎన్నెన్ని పంపిస్తున్నదీ ఎంఈఓ వి. భాస్కరరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లేశ్వరరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన



రజ్జిలి గ్రామంలో కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

కురుపాం: రేబిస్ వ్యాధిపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని మండల పశు వైద్యాధికారిణి శైలజ సూచించారు. మండలంలోని రజ్జిలి గ్రామంలో కుక్కలకు రేబిస్ టీకాలను బుధవారం వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ రేబిస్ వ్యాధి సంక్రమించే వ్యాధి అని ముందస్తుగా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. గ్రామాల్లో వీధి కుక్కలకు కూడా వ్యాక్సినేషన్ చేస్తున్నామని అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూటక నీలవేణి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ జి.అఖిలేష్, సిబ్బంది నరేంద్ర, మణికంఠేశ్వరి పాల్గొన్నారు.

వెదురు మొక్కల పంపిణీ



వెదురు మొక్కలు పంపిణీ చేస్తున్న ఏపీఎం కమలకుమారి

సీతంపేట: వెదురు మొక్కలు సాగుచేసి ఆదాయం పొందవచ్చని ఏపీఎం కమలకుమారి అన్నారు. బుధవారం స్థానిక హెచ్ఎన్‌టీసీ నర్సరీ వద్ద గిరిజన రైతులకు బుధవారం వెదురు మొక్కలు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు 60 చొప్పున 256 మందికి మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ

జియ్యమ్మవలస: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ధర్మారావు బుధవారం తెలిపారు. పంచాయతీ ఓన్ సోర్సెస్‌పై శిక్షణ ఉంటుందని, ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిపై శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు.